
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 13 జనవరి 2024



సంబరానికి సన్నద్ధం

సంక్రాంతి సందడి మొదలైంది.. పండగ చేసుకునేందుకు అంతా సొంతూళ్లకు చేరుకుంటున్నారు.. బస్టాండ్లు, రోడ్లు ప్రయాణికులతో కళకళ లాడు తున్నాయి..మరోపక్క కోడిపందేల కోసం పందెం రాయుళ్లు రెడీ అవుతున్నారు.. ఎన్నికల కోసం అధికారులు సన్నద్ధమవు తున్నారు.. జిల్లాలో ఇప్పుడు ఎక్కడ చూసినా హడావుడి కనిపిస్తోంది..



భీమవరం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

సొంతూళ్లకు చలో..

ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిట

భీమవరం టౌన్, జనవరి 12 : సంక్రాంతికి ఇతర ప్రాంతాల నుంచి సొంతూర్లకు వస్తున్నారు. రోడ్లన్నీ వాహనాలతో కిటకిట లాడుతున్నాయి. ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ఇప్పటికే స్వస్థలాలకు చేరుకుంటున్నారు. సంక్రాతి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ 81 ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేసింది. భీమవరం డిపో నుంచి రోజుకు 9 సర్వీసులు, నరసాపురం 6 , తణుకు 7, తాడేపల్లిగూడెం నుంచి మూడు సర్వీసులు ఏర్పాటు చేశారు. అన్ని సర్వీసులకు రిజర్వేషన్‌లు నిండిపోయాయి. 13న హైదరాబాద్ నుంచి 23 సర్వీసుల ద్వారా ప్రయాణికులు వచ్చే అవకాశం ఉంది. వీటితో పాటు ప్రైవేట్ వాహనాల్లో, రైళ్ళ ద్వారా చేరుకుంటున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక సర్వీసుల్లో వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాడేపల్లిగూడెం డీఎం సత్యనారాయణమూర్తితో పాటు డిపో నుంచి ఇద్దరు చొప్పున సిబ్బందిని పంపించారు. సంక్రాంతి పండగ తరువాత తిరిగి హైదరాబాద్ వెళ్ళే ప్రయాణికుల కోసం 16,17,18,19 తేదీల్లో ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశారు. భీమవరం డిపో నుంచి 4, నరసాపురం డిపో నుంచి 4, తణుకు డిపో నుంచి 5, తాడేపల్లిగూడెం డిపో నుంచి మూడు సర్వీసులు ఏర్పాటు చేశారు. అవసరమైతే మరిన్ని సర్వీసులు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. వరుసగా సెలవులు, సంక్రాంతి పండుగ సెలవులు రావడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు వారి సొంత గ్రామాలకు వెళుతుండడంతో పల్లెవెలుగు బస్సులు కూడా రద్దీగా కనిపిస్తున్నాయి. అమలాపురం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, విజయవాడ రూట్‌లు కిటకిటలాడు తున్నాయి. మరో రెండు రోజులు రద్దీగా ఉంటుందని దానిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సర్వీసులు నడిపే ఆలోచన చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.







ఆకివీడు ప్రాంతంలో పందేలకు సిద్ధం చేస్తున్న బరులు

బరి తెగించాల్సిందే..

తొలిరోజు 80 బరులు వరకు ప్రారంభమయ్యే అవకాశం

భీమవరం,జనవరి 12 : సంక్రాంతి సంబరానికి మరో 24 గంటలు సమయం ఉండటంతో సర్వత్రా కోడిపందాలపై ఆసక్తి పెరిగింది. ఇప్పటికే సిద్ధం చేస్తున్న బరుల వద్ద పోలీస్ నిఘా పెంచారు. అయినప్పటికీ ఎవరి ప్రాంతాల్లో వారు బరులు సిద్ధం చేసుకుంటున్నారు. పండుగ మూడురోజులు సంప్రదాయం పేరు చెప్పి కోడిపందేలు, ఆ వెనుక జూదాలు నిర్వహించడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం జిల్లాలో సుమారు 80 బరులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. గతంలో కోడిపందాల బరులు రూ.5 లక్షలు నుంచి 80 లక్షల వరకు వేలం వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. కొన్నిచోట్ల అధికార పార్టీయే ముందుస్తుగా అడుగులు వేస్తోంది.

ఎన్నికల విధులకు టీచర్లు !

వివరాలు కోరిన ఎలక్షన్ కమిషన్



భీమవరం ఎడ్యుకేషన్ /ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12 : సార్వత్రిక ఎన్నికల విధులకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా నుంచి ఉపాధ్యాయుల వివరాలను పంపారు. ఎన్నికల విధులకు ఉపాధ్యాయులను సేవలను విని యోగించుకోవాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ వివరాలను సేకరించిన నేషనల్ ఇన్ఫ ర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) ద్వారా గురువారమే పంపి నట్టు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి. ఏలూరు జిల్లాలో ఎన్నికల విధులకు మొత్తం 10 వేల మంది సిబ్బంది అవసరమవు తారని అంచనా కాగా వీరిలో గెజిటెడ్ ర్యాంకు వున్న ప్రధానోపాధ్యాయులు, తత్సమాన కేడర్ స్కేలులో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యా యులు కలిపి మొత్తం 4 వేల మంది వివరాలను పంపించినట్టు వివ రించాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో గెజిటెడ్ హెచ్‌ఎంలు 200 మంది, తత్సమాన స్కూల్ అసిస్టెంట్‌లు సుమారు 3000 మంది వరకు ఉన్నట్లు సమాచారం అందించారు. టీచర్ల అర్హతలు, సీనియార్టీని బట్టి పోలింగ్ అధికారులు (పీవో)గా నియమించే అవకాశం ఉంది. ఉపాధ్యాయులకు ప్రభుత్వం పైవున్న వ్యతి రేకత దృష్ట్యా వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించేలా బోధనేతర పనుల నుంచి మినహాయింపు నిస్తూ కొన్ని నెలల క్రితం ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. టీచర్ల స్థానే సచివా లయాల సిబ్బందిని నియమిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ఎన్నికల విధులకు ఉపాధ్యా యుల సేవలను వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది.



ఐదు ప్రాంతాల్లో చెక్ పోస్టులు

రెండురోజుల్లో ఏర్పాటు చేయాలి : కలెక్టర్

భీమవరం, జనవరి 12: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అంతర జిల్లాల చెక్ పోస్టులు రెండు రోజుల్లోగా ఏర్పాటు చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. 24 గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరు, ఎస్పీ రవి ప్రకాశ్‌లు తమ కార్యాలయాల నుంచి వివిధ మండ లాలు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో యలమంచిలి మండలం చించినాడ, భీమవరం మండలం లోసరి, పెనుగొండ మండలం సిద్ధాంతం, ఆకివీడు మండలం దుంపగడప, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పోలీసు, జీఎస్టీ, సెబ్, ఎక్సైజ్, అటవీ, రవాణా శాఖ అధికారులు, సిబ్బందిని ఈ చెక్‌పోస్టులలో నియమించాలన్నారు. వాహనాలను తనిఖీ చేసి లిక్కరు, నగదు, బహుమతులు వంటివి ఉంటే వాటిని సీజ్ చేయాలన్నారు. ప్రతి శనివారం కలెక్టరు కార్యాలయానికి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. డిప్యూటీ ట్రైనీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, కలెక్టరు కార్యాలయ ఏవో అప్పారావు, ఎలక్షన్ తహసీల్దారు దుర్గాకిషోర్, డిప్యూటీ తహసీల్దారు సన్యాసిరావు పాల్గొన్నారు.

నాలుగేళ్ల తర్వాత సొంతూరుకు..

సంక్రాంతి వేడుకలకు ఎంపీ రఘురామకృష్ణరాజు

భారీగా స్వాగతం పలికేందుకు అభిమానులు ప్రణాళిక



భీమవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు సంక్రాంతికి తమ సొంతూరు భీమవరం రానున్నారు. నాలుగేళ్ల తర్వాత ఆయన సొంత గడ్డపై అడుగు పెట్టనున్నారు. ఎంపీ రాక కోసం ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారు. పార్టీలకతీతంగా ఆహ్వానించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీల్లో ఆయన అభిమానులున్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ మీదుగా జనవరి 13న విమానంలో రఘురామ కృష్ణరాజు రాజమండ్రి చేరుకుంటారు. ఉదయం 10 గంటలకు రాజమండ్రి విమానాశ్రయంలో దిగుతారు. అక్కడి నుంచి ర్యాలీగా భీమవరం తీసుకు రావడానికి ఎంపీ అభిమానులు ప్రణాళిక చేశారు. నాలుగు రోజులపాటు భీమవరంలోనే ఎంపీ నివాసం ఉంటారు. సంక్రాంతి సంబరాల్లో పాల్గొంటారు. కోర్టు కూడా ఆయనకు ఊరట కలిగించేలా ఉత్తర్వులు ఇచ్చింది. ఆయనకు తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. రఘురామ కృష్ణరాజు 2020 జనవరిలో భీమవరం వచ్చారు. ఏపీ నిట్ స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. తర్వాత సీఎం జగన్‌తో ఏర్పడిన వివాదాల కారణంగా ఆయన తన సొంత నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. వచ్చేందుకు పలుమార్లు ప్రయత్నాలు చేసినా అధికార పార్టీ నాయకులే ఆయనపై దాడికి పన్నాగం పన్నారంటూ ఇంటిలిజెన్స్ నివేదికలు అందాయి. దీంతో విజయవాడ నుంచే మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లిపోయారు. ఆ తర్వాత భీమవరంలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా మరోసారి రావడానికి సిద్ధపడ్డారు. అప్పట్లో ప్రోటో కాల్ ప్రకారం ప్రధాని సభా వేదికపై ఆయనకు చోటు లభించాలి. కానీ ప్రొటోకాల్‌లో ఎంపీ పేరులేదు. మరోవైపు అరెస్ట్ చేస్తారన్న పుకార్లు షికార్లు చేశాయి. ప్రధాని వేదికపై ఆశీనులు కావడానికి ప్రోటోకాల్‌లో పేరు లేకపోవడంతో మార్గమధ్యం నుంచే మళ్లీ వెళ్లిపోయారు. ప్రభుత్వం అనుసరి స్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలపై ఢిల్లీ నుంచే విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఎన్నికల్లో తమ పార్టీ ఓటమి ఖాయమంటూ కుండబద్దలు కొడుతున్నారు.

ఏటిగట్టు పనులు నీటిపాలు

50 మీటర్ల మేర నదిలో కొట్టుకుపోయిన గట్టు

భయం గుప్పెట్లో పొన్నపల్లి వాసులు

నరసాపురం టౌన్, జనవరి 12: నరసాపురం వద్ద చేపట్టిన ఏటిగట్టు పనుల్లో డొల్లతనం బయటపడింది. సుమారు రూ.28 కోట్ల అంచనాతో చేపట్టిన గట్టు పటిష్ట పనులు ఇటీవల గోదావరిలో కొట్టుకుపోయాయి. సుమారు 50 మీటర్ల మేర గట్టుకు కోత పడింది. ప్రస్తుతం గట్టుపై ఉన్న 8మీటర్ల వెడల్పు రోడ్డు మాత్రమే మిగిలింది. ఇది కూడా క్రమంగా కోతకు గురి అవుతూ వస్తుండటంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గోదావరి పక్కనే ఉన్న పొన్నపల్లి వాసులు భయంతో బిక్కుబిక్కు మంటున్నారు. 2022 జూన్ నెలలో గోదావరికి వరద పోటెత్తినప్పుడు పట్టణంలోని అమరేశ్వరస్వామి ఆలయం నుంచి బుడితల రేవు వరకు ఏటిగట్టు కోతకు గురైంది. అప్పట్లో రూ.50లక్షలు వెచ్చించి తాత్కాలికంగా అడ్డుకట్ట పనులు చేపట్టారు. 2022 నవంబర్ నెలలో రూ.28 కోట్ల అంచనాతో చేపట్టే గట్టు పటిష్ట పనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. 2023 మే నెలలో పనులు చేపట్టారు. అమరేశ్వరస్వామి నుంచి బుడితల రేవు వరకు 100 మీటర్లు గట్టును పటిష్ఠపర్చి కోతకు గురికాకుండా రాళ్లతో గ్రోయిన్స్ ఏర్పాటు చేశారు. వాస్తవానికి అమరేశ్వర స్వామి ఆలయం నుంచి శ్మశానం వరకు 200 మీటర్లు గట్టు పటిష్ట పర్చాల్సి ఉండగా 100 మీటర్లు మాత్రమే ఇప్పటికి పూర్తయింది. ఇక్కడ వినియోగించిన రాళ్ల నాసిరకమైనవని, క్వాలీఫైడ్ క్వారీ నుంచి కాకుండా గుర్తింపులేని క్వారీ నుంచి రాళ్లను తీసుకొచ్చి పనులు చేపడుతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ఆరోపణలు చేశారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు ఈపనులకు బినామీలుగా వ్యవహరిస్తున్నారని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని గత ఆగస్టు నెలలో జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల నేడు చేపట్టిన కోట్లాది రూపాయల పనులు నీటిపా లయ్యాయి. ప్రస్తుతం వరద లేకుండానే వేసిన గట్టు 50 మీటర్లు కొట్టుకు పోవడం ప్రజల్ని విస్మయానికి గురి చేసింది. మరోవైపు కోతకు గురైన ప్రదేశంలో తాత్కాలికంగా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటు కోతకు గురైన గట్టును శుక్రవారం పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు మరోసారి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరిపై ఫైర్ అయ్యారు. కోతకు ముదునూరి బాధ్యత వహించాలని, చేసిన పనులపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నాయకుడు కొవ్వలి రామ్మోహన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ఏటి గట్టును పరిశీలించి విస్మయం వ్యక్తం చేశారు.



కోతకు గురైన గట్టు



ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు



జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం వినూత్న నిరసనలు చేపట్టారు. భీమవరంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వీరవాసరం, తణుకు, ఇరగవరం, పెనుమంట్ర, మొగల్తూరు, పెంటపాడు, తదితర ప్రాంతాల్లో శిబిరాల వద్ద ఆందోళన చేశారు. - 8లో..



అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభం





శేషమ్మ చెరువులో పెళ్లి కూతురమ్మ ఉత్సవాలు

7

సహకారానికి ఉరి

ఐటీడీఏ అధికారులు, ఉద్యోగులకు
సంక్రాంతి సెలవుల్లేవా !

» నేటి నుంచి 15 వరకు పీఎం-జన్మన్ ప్రోగ్రాంకు అందుబాటులో ఉండాలని సర్క్యులర్ » ఎన్జీవో నేతల అభ్యంతరం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12:సంక్రాంతి సెలవు దినాల్లో సైతం ఉద్యోగులను అందుబాటులో ఉండాల్సిందిగా జిల్లా యంత్రాంగం జారీ చేసిన ఆదేశాలపై ఏపీ జేఏసీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్జీవో నాయకులు తెలిపిన వివరాలివి.. కొండప్రాంతాల్లో నివసించే ప్రజల్లో రక్తహీనతతో పాల కారణంగా సికిల్‌సెల్ ఎనీమియా బారినపడిన వారిని గుర్తించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో 'పీఎం-జన్మన్' పేరిట ఈనెల 13,14,15 తేదీల్లో చేపట్టిన సర్వేను జిల్లాలోని కే.ఆర్.పురం ఐటీడీఏ మండలాల్లో నిర్వహిస్తున్నారు. ఈ ప్రోగ్రాంకు ఐటీడీఏ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు మూడురోజులూ అందుబాటులో ఉండాలని గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరిస్తూ కే.ఆర్.పురం ఐటీడీఏ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు అందుబాటులో ఉండాల్సి ఉంటుందని ఏపీ జేఏసీ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ జనరల్ ఆర్.ఎస్.హరనాథ్ పేర్కొన్నారు. హిందువుల అతిపెద్ద పండుగైన సంక్రాంతికి ఉద్యోగులు బంధువుల ఇళ్లకు వెళ్ళడం, ఇతర ప్రాంతాలనుంచి ఇక్కడకు రావడం జరుగుతాయని, పితృదేవతలకు, మరణించిన కుటుంబపెద్దలకు ఆచారాలు సమర్పించడం వంటివి చేస్తారని ఈ నేపథ్యంలో సెలవు రోజుల్లోనూ విధులకు హాజరుకావాలని సర్క్యులర్ జారీచేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. శనివారం నుంచి మంగళవారం వరకు సెలవులను ప్రభుత్వం ఇచ్చిన విషయాన్ని విస్మరించారా అని ప్రశ్నించారు. జాతీయ కార్యక్రమమైనప్పటికీ రాష్ట్ర/స్థానిక పండుగలపై కేంద్రానికి తెలియజేసి మినహాయింపు లేదా మరోరోజుకి వాయిదా వేసుకోవడానికి జిల్లా అధికారులకు వెసులు బాటు ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ సెలవుదినాల్లో పనిచేయాల్సి వస్తే ఆ మేరకు సరిపడా ఇతర రోజుల్లో సెలవు తీసుకునేలా స్పెషల్ క్యాజువల్ లీవు ఇవ్వాల్సి ఉంటుందని, దీనిని కూడా పట్టించుకోకుండా కేఆర్.పురం ఐటీడీఏ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి శనివారం తీసుకెళ్ళి పీఎం-జన్మన్ ప్రోగ్రాంను జిల్లాలో వాయిదా వేయడం లేదా ప్రత్యేక క్యాజువల్ లీవులు ఇచ్చేలా కోరతామని హరనాథ్ వివరించారు.

జడ్పీ పీఎఫ్ ఖాతాల్లో సాంకేతిక సమస్యల పరిష్కారానికి అంగీకారం

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 12 :జడ్పీ ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలను అందుబాటులో ఉంచాలని అభ్యర్థిస్తూ శుక్రవారం జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్. సుబ్బారావుతో ఏపీటీఎఫ్, పీఆర్టీయూ జిల్లానాయకులు జరిపిన చర్చల్లో అంగీకారం కుదిరింది. వివరాలను సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, పి.ఆంజనేయులు, బి.రెడ్డిదొర తెలిపారు. వచ్చే మార్చి 31నాటికి పీఎఫ్ ఖాతాలన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌డేట్‌చేసి టీచర్లకు అందుబాటులో ఉంచేందుకు అధికారులు అంగీకరించారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా విభజన (మూడు జిల్లాలు)కారణంగా వేరే జిల్లాలో వున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల నెలవారీ చందాకు సంబంధించిన నగదును ఏలూరు జిల్లా ఖాతాలోకి బదిలీ చేసిన నేపథ్యంలో ఏర్పడిన సాంకేతిక సమస్యను త్వరలోనే పరిష్కరించి ఉపాధ్యాయుల వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్ళిస్తారని వివరించారు. మూడేళ్ళుగా పీఎఫ్ బ్యాలెన్స్ షీట్లను విడుదల చేయడం లేదని, తక్షణమే వాటిని విడుదలచేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. పీఎఫ్ రుణాలు మంజూరుచేసే విషయంలో ఇబ్బందులు పెట్టవద్దన్నారు. గతేడాది ఏప్రిల్‌లో మంజూరైన పీఎఫ్ రుణాల నగదు మొత్తాలు ఇంతవరకు సంబంధిత టీచర్ల బ్యాంకు ఖాతాలకు జమ చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నందున సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. చర్చల్లో సంఘ ఏలూరురూరల్ అధ్యక్షుడు రామశేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయంలో కూడారై ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పారిజాత గిరిలో కూడారై ఉత్సవం

జంగారెడ్డిగూడెంటౌన్, జనవరి 12:గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కూడారై మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అందంగా తీర్చిదిద్దిన రంగవల్లికలో 108 గంగాలాలతో అక్కార్ అడిషల్ ప్రత్యేక ప్రసాదాన్ని గోదా సమేత శ్రీరంగనాథ స్వామికి నివేదనగా సమర్పించినట్టు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులకు గోదా శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులకు వికాస్ తరంగిణి, వాసవి ఫ్యాన్సీ వారి సౌజన్యంతో బహుమతులు అందజేశారు. ఆలయ మాజీ ఛైర్మన్ వందనపు సాయిబాలపద్మ, అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు, వాసవి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మావుళ్ళమ్మ ఉత్సవాల్లో..

భీమవరంటౌన్, జనవరి 12 : మావుళ్ళమ్మ అమ్మవారి 60 వార్షిక మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 5.05 నిమిషాలకు రామాయణం గోవిందరావు, వెంకటేశ్వరి దంపతులచే కలశస్థాపన, అమ్మవారికి కుంకుమ పూజలు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభం. బాలాగోపి మ్యూజికల్ బ్యాండ్ ట్రూప్‌తో ఊరేగింపు. సాయంత్రం 4 గంటలకు కొటికలపూడి గోవిందరావు కళావేదికపై మునిసిపల్ కమిషనర్ ఎం. శ్యామల చేతుల మీదుగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం. సాయంత్రం 5 గంటలకు తుమ్మ నాగమణి(మల్లవేలు)చే హరికథ, రాత్రి 8 గంటలకు శ్రీశ్రీరాజరాజేశ్వరి నాట్యమండలి (గుడివాడ) వారిచే కనకదుర్గ మహాత్మ్యం నాటకం.

క్రికెట్‌లో రాణించాలంటే ఎంతో కష్టపడాలి

» ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ టాలెంట్ కమిటీ సభ్యుడు మంగేశ్



భీమవరంటౌన్, జనవరి 12 : యువత క్రికెట్‌లో రాణించాలంటే ఎంతో కష్టపడితే తప్ప అనుకున్న లక్ష్యం సాధించడం సాధ్యం కాదని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ కమిటీ సభ్యుడు మంగేశ్ స్పష్టం చేశారు. భీమవరంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో శుక్రవారం మాట్లాడా రు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-14, అండర్-16 క్రీడాకారులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఒకప్పుడు రంజీ క్రికెట్‌లో ఆడానని, ప్రస్తుతం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ కమిటీలో సభ్యుడిగా కొనసాగుతున్నా నన్నారు. క్రికెట్ పోటీలు నిర్వహించే ప్రాంతానికి వెళ్లి తమ కమిటీ సభ్యులు ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి అసోసియేషన్‌కు జాబితా అందిస్తామన్నారు. ఈవిధంగా ఎంపిక చేసిన క్రీడాకారులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తారన్నారు.

ఉభయ గోదావరి జిల్లాలో సబ్ సెంటర్లు

యువ క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు ఉభయ గోదావరి జిల్లాలోని భీమవరం, ఏలూరులో సబ్ సెంటర్‌లు ఉన్నాయి. మంచి కోచ్‌లు కూడా ఉన్నారని వారు ఉచితంగా క్రీడాకారులకు శిక్షణ ఇస్తారన్నారు. క్రికెట్‌పై ఆసక్తి గలవారు ఈ సబ్ సెంటర్లను వినియోగించుకోవాలన్నారు.

180 మంది బైండోవర్

ముసునూరు, జనవరి 12: సంక్రాంతి సంద ర్భంగా కోడిపందేలు, ఇతర జూద క్రీడలు జరగ కుండా ముందస్తుగా పాత ముద్దాయిలను బైండోవర్ చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. శుక్రవారం నాటికి మండల పరిధిలో కోడి పందేల నిర్వహణ, కోడి కత్తుల తయారీ, కోళ్లకు కత్తులు కట్టేవారు 180 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేశామని తెలిపారు. సంప్రదాయం ముసుగులో కోడిపందేలు, జూదం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సహకార రంగాన్ని చావుదెబ్బతీసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. రైతులకు ఎంతగానో ఉపయోగపడే సహకార రంగంలో ప్రైవేట్ పెట్టుబడుల పెట్టేలా చీకటి ప్రయత్నాలు చేస్తోందంటూ సొసైటీ ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నారు. ఇది కాస్త ప్రైవేటుకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే సిబ్బందిపై కక్షగట్టే ప్రమాదం ఉందంటూ మరోవైపు ఆందోళన చెందుతున్నారు. ప్రశ్నించే వారి గొంతునొక్కేప్రయత్నాలను ప్రభుత్వం చేస్తుండడంతో సహకార సంఘాల్లో ప్రైవేట్ పెట్టుబడులకు మార్గం సుగమం అవుతోంది. దీనిపై రైతులు, నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగుల భద్రత కూడా ప్రశ్నార్థకం కానుంది.
- తాడేపల్లిగూడెం రూరల్

సహకార రంగానికి ఉరి!



ప్రైవేటు పెట్టుబడులకు ప్రభుత్వ ప్రోత్సాహం

» ప్రశ్నించలేని త్రిసభ్య కమిటీలు
» ఆందోళనలో రైతులు, ఉద్యోగులు

త్రిసభ్య కమిటీలతో ప్రభుత్వ పెత్తనం

వైసీపీ ప్రభుత్వంలో సహకార సంఘాలు స్వేచ్ఛను కోల్పోయాయి. ప్రభుత్వ నిర్ణయాలకు తందాన కొడుతున్నాయి. ఎన్నికలు లేవు. ఓటు వేసే ప్రాథమిక హక్కును రైతులు కోల్పోయారు. సహకార చరిత్రలో లేనివిధంగా త్రిసభ్య కమిటీలను ప్రభుత్వమే నియమిస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇదేతంతు సాగుతోంది. ఎన్నికల ద్వారా గతంలో పాలకవర్గ నియామకం జరిగేది. రైతులకు అనుకూల నిర్ణయాలు తీసుకునేవారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం పొందేలా పాలకవర్గాలు కృషి చేసేవి. ఇప్పుడు అధికార పార్టీ నాయకులను, కార్యకర్తలను త్రిసభ్య కమిటీలో నియమిస్తున్నారు. వారే సహకార సంఘాలను శాసిస్తున్నారు. సొసైటీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా సరే ప్రశ్నించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రైవేటు పెట్టుబడుల విషయంలోనూ అదే జరుగుతోంది. ప్రైవేటు సంస్థలు ఒక్కసారి సహకార రంగంలోకి వస్తే సన్న, చిన్న కారు రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. లాభార్జనే ధ్యేయంగా సొసైటీలు వ్యవహరించనున్నాయి. అధికార పార్టీకి చెందిన నాయకులే సొసైటీల్లో త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌లుగా వ్యవహరిస్తుండడంతో ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే నాథుడే కరువయ్యారు. ప్రశ్నిస్తున్న ఉద్యోగులను అణచివేసేందుకు ప్రభుత్వం తన అధికారాలు వాడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పశ్చిమ జల్లాలో ఉన్న 260 సహకార సంఘాలున్నాయి. ఒకసారి ప్రైవేట్ పెట్టుబడులు వస్తే సహకార సంఘాలతోపాటు, వాటికి నిధులు సమకూర్చే డీసీసీబీలు, ఆప్కాబ్‌ల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

సహకార సంఘాలకు పెనుముప్పు

సహకార రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు ప్రభుత్వం బిల్లును ఆమోదించింది. అది అమలు జరిగితే సహకార రంగంలో 50 శాతం ప్రైవేట్ పెట్టుబడులు పెట్టేందుకు అవకాశం ఉంటుంది. సహకార వ్యవసాయ పరపతి సంఘంలో 50శాతం వాటాలోకి ప్రైవేటు వ్యక్తులు, కంపెనీలు, చిట్ ఫండ్ సంస్థలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి నిధులు కలిగిన సంస్థలు పెట్టుబడులు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. కనీసం రూ.50లక్షలు నుంచి సొసైటీ టర్నోవర్‌లో 50శాతం వరకు పెట్టుబడులు పెట్టేందుకు బిల్లు అవకాశం కల్పిస్తోంది. అంతకు మించి సొసైటీలో పెట్టుబడులు పెట్టాలనుకుంటే గ్రాంట్‌ల రూపంలో ఇవ్వవచ్చు. అయితే 50 శాతం పెట్టుబడులు పెట్టే సంస్థలకు ఓటింగ్ హక్కుకూడా ఉంటుంది., దీంతో ఈ ప్రైవేటు సంస్థలు తమ లాభాల కోసం సహకార రంగాన్ని ఓటింగ్ ద్వారా శాసించే అవకాశం ఉంటుందని రైతులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రైవేటు సంస్థలకు 50 శాతం ఓటింగ్ హక్కు ఉంటే సహకార నిర్ణయాలు డబ్బుతోనే శాసించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది సహకార రంగానికి ప్రైవేటు తాడుతో ఉరివేయడమేనంటూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

నోరుమెదపలేని నాయకులు

గతంలో సహకార సంఘాల పాలక వర్గాలను రైతులు ఎన్నుకునే వారు.. ఆవిధంగా ఎన్నికైన అధ్యక్షులు, డైరెక్టర్‌లు వ్యవసాయానికి అవసరమైన వాటిని అందించేందుకు ముందుండేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థను నామినేటెడ్ వ్యవస్థగా మార్చింది. పార్టీ నాయకులనే త్రిసభ్య కమిటీగా వేసి ప్రభుత్వ ఆధిపత్యం చలాయిస్తోంది. ఈ సమయంలో ఈ సహకారరం గతంలో ప్రైవేటు పెట్టుబడులు పెట్టడం అంశాన్ని వ్యతిరేకించే నాయకుడు కరువయ్యారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం ఇచ్చిన కమీషన్‌ను పక్కదారి పట్టించినాసరే త్రిసభ్య కమిటీలు ప్రశ్నించ లేదు. ఒక దశలో కమీషన్‌ను రైతులకు ఇవ్వాలంటూ ప్రభుత్వం ఆదేశించింది. ఆ సొమ్ములు అధికార పార్టీ నేతలే దిగమింగారు. త్రిసభ్య కమిటీలు ఏమీ చేయలేకపోయాయి. ఇప్పుడు కూడా ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదు. దీనిపై త్రిసభ్య కమిటీలు ప్రశ్నించలేని దుస్థితిలో ఉన్నాయి. ఒక విధంగా సొసైటీలు స్వతంత్రను కోల్పోయాయి. ప్రభుత్వ కనుసన్నల్లో నడుస్తున్నాయి.

అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభం

» జెండా ఊపిన ముదునూరి, రైల్వే అధికారులు

నరసాపురం, జనవరి 12:నరసాపురం-హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రారంభోత్సవం నరసాపురం రైల్వేస్టేషన్‌లో కోలాహలంగా జరిగింది. గుంటూరు స్టేషన్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అదే సమయంలో నరసాపురం రైల్వేస్టేషన్ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీను, రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు జెండా ఊపి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. బీజేపీ, సీపీఎం, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త ఎక్స్‌ప్రెస్‌లు నడపాలి

డబ్లింగ్ లైన్ పనులు పూర్తయినందున పెండింగ్‌లో ఉన్న కొత్త రైళ్లను పట్టాలెక్కించాలని ముదునూరి ప్రసాదరాజు కోరారు. ఆయన మాట్లాడుతూ నరసాపురం-విశాఖ, బెంగళూరు, వారణాశి రైళ్లను కూడా త్వరలో ప్రారంభించాలన్నారు. రైల్వే ఏడీఆర్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో మరికొన్ని రైళ్లను నడిపేందుకు ప్రయత్నిస్తామని, విశాఖరైలును పునరుద్ధరిస్తామన్నారు. టీడీపీ కౌన్సిలర్ పాలూరి బాబ్జి, కలిగినీడి కుమార్, ఎస్ఎంలు మధుబాబు, దివాకర్, ఛైర్‌పర్సన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



అమరావతి రైలు, జెండా ఊపుతున్న చీఫ్ విప్ ముదునూరి, ఏడీఆర్ఎం

వివేకానంద బోధనలు స్ఫూర్తిదాయకం



నిట్‌లో వివేకానందుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 12 : వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ యువతలో చైతన్య స్ఫూర్తిని రగిలించిన మహోన్నత వ్యక్తి స్వామివివేకానంద అన్నారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ



చెక్‌పోస్టు వద్ద ఎస్పీ మేరీప్రశాంతి ఎస్ఈబీ, పోలీస్ అధికారులు

జీలుగుమిల్లి, జనవరి 12 : రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద పనిచేసే సిబ్బంది విధ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. తాటియాకులగూడెం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ విషయమై శుక్రవారం ఆరా తీశారు. సంక్రాంతి, త్వరలో వచ్చే ఎన్నికల కోడ్ దృష్టిలో ఉంచుకుని మద్యం, నాటుసారా ఇతర మాదక ద్రవ్యాలుతరలి పోకుండా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్, ఎస్ఈబీ ఎస్ఐ మస్తానయ్య, సిబ్బంది ఆర్.శ్రీనివాస్, ప్రవీణ్, షాను ఉన్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మరో 27 సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న టెక్నీషియన్లు

ఏలూరు క్రైం, జనవరి 12 :ఏలూరు ప్రభుత్వాసుపత్రి టీచింగ్ ఆసుపత్రిగా మారడంతో రక్షణ చర్యల్లో భాగంగా 27 అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని సీసీ కెమెరాలు ఉన్నప్పటికి సరిగా పనిచేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కవరేజీ లేకపోవడంతో ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు అధికారులు గుర్తించారు. తల్లీబిడ్డల విభాగపు ప్రాంతంలోనూ అక్కడే ఉన్న మెడికల్ కళాశాల విద్యార్థినుల హాస్టల్స్ వద్ద కూడా కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంతంలో 8 కెమెరాలు ఏర్పాటు చేస్తు న్నారు. మిగిలిన 19 కెమెరాలు ఆసుపత్రి విభాగంలో ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులన్నీ వారం రోజుల్లో పూర్తి చేయనున్నారు.

'జడ్పీ'లో రూ.90.5 లక్షలతో ఆధునికీకరణ పనులు



పనుల శంకుస్థాపనలో ఘంటా పద్మశ్రీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 12: జడ్పీ కార్యాలయంలో రూ.90.5 లక్షలతో చేపట్టిన ఆధునికీకరణ పనులకు జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ కార్యాలయ సిబ్బంది పనిచేసే ప్రదేశంలో ఆహ్లాదకరమైన వాతా వరణం కల్పించేందుకు పలు విభాగాలను ఆధునికీకరిస్తున్నట్టు తెలిపారు. సిబ్బంది మరింత శ్రద్ధతో పనిచేసేం దుకు అవకాశం ఉంటుందన్నారు. నిడదవోలు జడ్పీటీసీ కె.సూర్యారావు, జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్ సుబ్బారావు, డిప్యూటీ సీఈవో ఎన్.నిర్మలజ్యోతి, పంచాయతీ రాజ్ పర్యవేక్షక ఇంజినీర్ కేదారేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బిల్డింగ్ పైనుంచి పడి పెయింటర్ మృతి

ఏలూరు క్రైం, జనవరి 12 : బిల్డింగ్‌కు సున్నం వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కె.మరియదాసు (40) కొంతకాలం నుంచి ఏలూరు తూర్పువీధిలో ఒక రూమ్‌ను అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటూ పెయింటింగ్ పనులకు వెళ్తున్నారు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని పెయింటింగ్ పనులు చేయడానికి శుక్రవారం ఉదయం వెళ్లారు. ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారి కింద పడి తీవ్ర గాయాలకు గురికాక వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి మరియదాసు మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 12 : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రుకు చెందిన ఈదా జగన్నాధం(85) కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆ బాధ భరించలేక శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఏలూరు క్రైం, జనవరి 12 : ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏలూరు జూట్‌మిల్లు వెనుక రైల్వే బ్రిడ్జి కింద ఒక మృతదేహం ఉన్నట్టు ఏలూరు రైల్వే పోలీసులకు శుక్రవారం రాత్రి సమాచారం అందింది. రైల్వే ఎస్ఐ నరసింహారావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి 5.5 అడుగుల ఎత్తు, ఛామనఛాయ శరీరం కలిగి ఉన్నాడు. రేడియం రంగు పొట్టిచేతుల టీషర్టు, నీలం రంగు జీన్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్



గంజాయి విక్రయదారులను అరెస్టు చేసిన పోలీసులు

తాడేపల్లిగూడెం క్రైం, జనవరి 12: తాడేపల్లిగూడెంలో గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏపీ సాంకేతిక విద్యా సంస్థ సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద గంజాయితో ఉన్న ఆరుగురిని పట్టణ పోలీసులు శుక్రవారం పట్టుకుని వారి వద్ద నుంచి రూ.53280 విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు పట్టణ ఎస్ఐ సుధాకరరెడ్డి తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరు పర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు.. గేదె మృతి



ప్రమాదానికి కారణమైన లారీ, మృతిచెందిన గేదె

నూజివీడు టౌన్, జనవరి 12: వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి మహిళను ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాల పాలైన ఘటన నూజివీడు మండలం హనుమంతులగూడెంలో జరిగింది. రాజస్థాన్ నుంచి భీమవరానికి కోళ్లమేతతో శుక్రవారం వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఆ సమయంలో పాలు తీసేందుకు గేదె వద్ద కూర్చున్న గ్రామానికి చెందిన బాణావతు జ్యోతిని, గేదెను బలంగా ఢీ కొట్టడంతో గేదె చనిపోగా లారీ కింద ఆమె ఇరుక్కుపోయింది. గ్రామస్థులు ఆమెను అతి కష్టం మీద బయటకు తీసి చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి, అనంతరం విజయవాడ తరలించారు. ఈ ఘటనలో గుడివాడకు చెందిన లారీ డ్రైవర్ వెంకటేశ్వరరావు, క్లీనర్ కల్యాణ్‌కు స్వల్పగాయాలు కాగా వారిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

నూజివీడు, జనవరి 12: గొల్లపల్లిలో సిటీ కేబుల్ నిర్వహణలో పనిచేస్తున్న రాజేష్(36) కేబుల్ వైర్లను లాగుతున్న తరుణంలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ లైన్ స్తంభంపైకి ఎక్కాడు. ఈ క్రమంలో అతను విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. రాజేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించి రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకు ఇళ్లు దగ్ధం

పెంటపాడు, జనవరి 12 : అగ్ని ప్రమాదంలో తాటాకు ఇళ్లు దగ్ధమైన ఘటన ముదునూరులో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో చిట్టూరి వెంకన్న తన ముగ్గురు కుమారులతో రెండు పోర్షన్ల తాటాకు ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంకన్న కుటుంబసభ్యులకు తెలుపగా అందరూ బయటకు పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను నిలువరించారు. ప్రమాదంలో రూ.1.50 లక్షల విలువైన సామగ్రితో పాటు ఇంటిని నిర్మించుకునేందుకు అప్పుగా తెచ్చిన రూ.1.50 లక్షల నగదు కూడా అగ్నికి ఆహుతయిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.



పెళ్ళి కూతురమ్మ ఆలయం



పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడి విగ్రహాలు

అనగనగా ఓ పెళ్లికూతురమ్మ

రేపటి నుంచి మూడురోజుల పాటు పెళ్లి కూతురమ్మ ఉత్సవాలు

ఆచంట జనవరి 12 : ఆ ఊరిపేరు పెళ్ళి కూతురమ్మ చెరువు. ఈ పేరు వినేందుకు, చదివేందుకు ఆసక్తి కలిగిస్తోంది. ఓ పెళ్లి కూతురు పేరుతోనే ఆ ఊరు ఏర్పడింది. ఇది పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం, శేషమ్మ చెరువు పంచాయతీ సరిహద్దులోనూ, పెనుగొండ మండలం దేవ గ్రామం సరిహద్దులోను ఈ గ్రామం ఉంది. ఆ ఊరులో ప్రతిఏటా సంక్రాంతికి మూడురోజుల పాటు పెళ్లి కూతురమ్మకు అనేక మంది భక్తులు వచ్చి కానుకలు సమర్పించి తన భర్త, పిల్లలు, కుటుంబం క్షేమంగా ఉండాలని మొక్కుకుంటారు. కొన్ని దశాబ్దాల నుంచి ఈవిధంగా పూజలు అందుకున్నట్టు తెలుస్తుంది. సంప్రదాయబద్ధంగా సలిమిడి, పానకాల కావిడ్లు, అరటి గెలలు వంటి కానుకలు పెళ్లికూతురమ్మకు సమర్పించి పూజలు చేస్తారు. ఆచంట మండలంతో పాటు పరిసరాల్లోని గ్రామాల నుంచి దర్శించుకోవడానికి భక్తులు వస్తారు.

పొలాల మధ్యలోనే గుడి

కొన్నేళ్ల కిందట అడవిగా వున్న ఈ ప్రాంతం పొలాలు మధ్యగా ఉంది. అప్పట్లో కట్టిన గుడిలో పెళ్లి కుమార్తె తన భర్తను ఒళ్ళో ఉంచుకుని మరణించిన దృశ్యంతో విగ్రహాలు ఉండేవి. 1982లో ఆలయాన్ని పునరుద్ధరించారు. నూతన దంపతులు విగ్రహాల మధ్యలో పాము విగ్రహం ఉంటుంది. ఈనెల 14,15,16వ తేదీల్లో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు పెద్ద ఎత్తున నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ..

కొన్ని దశాబ్దాల కిందట ఆచంటకు చెందిన ఓ అబ్బాయికి, పెనుగొండకు చెందిన ఓ అమ్మాయికి పెళ్లి కుదిరింది. వీరిది వైశ్య కులంగా చెబుతారు. పెళ్లి పెనుగొండలోని వధువు ఇంట ఏర్పాటు చేశారు. రహదారులు లేని ఆ రోజుల్లో వరుడు తన పల్లకిలో కూర్చుని ఆచంట శేషమ్మచెరువు సమీపం నుంచి పెనుగొండ వెళ్తూ ఒక అటవీ ప్రాంతంలో పామును చంపుతాడు.పెళ్లైన తరువాత ఆచంటకు అదే దారిలో పల్లకిలో భార్యతో వెళ్తూ అదే ప్రదేశంలో మళ్లీ ఆగుతారు. ఆ సమయంలో అతడు చంపిన పాము తల వరుడిని కాటేయడతో చనిపోతాడు. ఇది చూసిన పెళ్లి కుమార్తె బంధువులకు కబురు పెట్టించి అక్కడే నిప్పులు గుండం ఏర్పాటు చేసుకుని భర్త శవంతో పాటు తను కూడా కాలి బూడిదైంది. దీంతో ఆమె జ్ఞాపకంగా ఒక చిన్నగుడి కట్టారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

భీమడోలు, జనవరి 12 : పూళ్ళ గ్రామంలో ఓ వ్యక్తిపై మద్యం సీసాలతో దాడి చేసిన ముద్దాయిని అరెస్టు చేశామని భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ తెలిపారు. పూళ్ళకు చెందిన సిద్దాబత్తుల విఘ్నేశ్వరరావు అనే కుటుంబానికి నూతులపాటి పోలు కుటుంబానికి గతంలో గొడవలు ఉండగా ఆ వివాదంలో విఘ్నేశ్వరరావు అన్నయ్య శంకరం చనిపోయారు. ఈ కేసు కోర్టులో ఉండగా తన అన్నయ్య మరణానికి కారణమైన పోలును హతమార్చాలనే ఉద్దేశంతో ఈనెల పదో తేదీ మధ్యాహ్నం పూళ్ళ బ్రాంది షాపు సమీపంలో పోలుపై బీరు సీసాతో కొట్టి దాడి చేశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితుడి విఘ్నేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సంక్రాంతి సంబరాలు







జిల్లావ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి.. భోగి మంటలు, ముగ్గుల పోటీలతో అలరించారు. పాలకోడేరులో కుర్చీలాట.. ఆకివీడులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భోగి మంటలు వేశారు. పెంటపాడులో ముగ్గుల పోటీల విజేతలకు జనసేన నాయకులు బహుమతులు అందించారు. పాలకొల్లు సుబ్రహ్మణ్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.. తూర్పువిప్పర్రులో సంక్రాంతి పోటీల్లో విజేతలకు జనసేన నేత విడివాడ రామచంద్రరావు బహుమతులు అందించారు.

కోడి పందేలకు బరులు సిద్ధం

ఆకివీడు, జనవరి 12: ఆకివీడులో కోడి పందేల నివారణకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. అధికారులు బరుల వద్దకు వెళ్లి నిర్వాహకులకు, భూ యజమానులకు నోటీసులు జారీ చేయడంతో పాటు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే అధికారుల మాటలు పెడచెవిన పెట్టి యథావిధిగా బరులు సిద్ధం చేస్తున్నారు.

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

మొగల్తూరు, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందేలు, పేకాట వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని మొగల్తూరు ఎస్ఐ ఎం.వీరబాబు హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరులో గతంలో నిర్వహించిన కోడి పందేల బరుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. మొగల్తూరు స్టేషన్ పరిధిలో ఇప్పటికే 200 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

దాళ్వా నారుమడులు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో డాక్టర్ శేఖర్

నరసాపురం రూరల్, జనవరి 12: దాళ్వా నారుమడులు త్వరితగతిన రైతులు వేసుకునేలా చైతన్యపర్చాలని ఏవో డాక్టర్ శేఖర్ అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందించే రాయితీలు, పథకాలు, ఇటీవల తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల ఇబ్బందులు, పరిహారం, రైతు భరోసా కేంద్రాల్లో అందిస్తున్న విత్తనాలు, ఎరువులపై సమీక్షించారు. సమావేశంలో ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, ఛైర్మన్ కె.నర్సింహారావు, ఇస్సాకు, మోహన్‌రావు పాల్గొన్నారు.

20న మండల సమావేశం

నరసాపురం రూరల్, జనవరి 12: ఈనెల 20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరభద్రరావు తెలిపారు. ఎంపీపీ సోని అధ్యక్షతన ఉదయం 10.30కు జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

సుందరకుమార్‌కు అభినందన

భీమవరం అర్బన్, జనవరి 12: ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా నియమితులైన దళిత నాయకులు గంటా సుందర్‌కుమార్‌ను శుక్రవారం భీమవరంలో దళిత నాయకులు అభినందించారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటపల్లి మంగరాజు, పొన్నమండ బాలకృష్ణ, బిరుదుగడ్డ రమేష్, కేసీ రాజు, పాలపర్తిజోనా పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆందోళన


పీఎఫ్ అధికారికి వినతి పత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

భీమవరం అర్బన్, జనవరి 12 : మోదీ సర్కారు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ స్కీమ్ జాతీయ పోరాట సమితి జేఏసీ నాయకులు ఎస్ఎస్ రావు, అబ్రహాం డిమాండ్ చేశారు. ప్రావిడెంట్ ఫండ్ పింఛన్‌ను వెయ్యి రూపాయల నుంచి 7,500 పెంచాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అధికారి జి.సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో భీమవరం, నర్సాపురం, తణుకు డిపోలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కోపల్లెలో సీసీ రోడ్లు ప్రారంభం

కాళ్ళ, జనవరి 12 : కోపల్లె గ్రామంలో రూ.23 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజుతో కలిసి డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నరసింహరాజు ప్రారంభించారు. ఎంపీపీ పెన్మెత్స శిరీష, కోపల్లె సొసైటీ ఛైర్మన్ వేగేశ్న జయరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు టీడీపీ నాయకుడి అండ


అనాథ పిల్లల కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న టీడీపీ గ్రామాధ్యక్షుడు కృష్ణమూర్తి

కాళ్ళ, జనవరి 12 : బొండాడ గ్రామ పరిధిలోని హరిచంద్రపురంకు చెందిన వనమల అప్పారావు దంపతులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుమారులిద్దరూ అనాథలుగా మిగిలారు. శుక్రవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి అనాథలైన ఇద్దరు పిల్లలకు తక్షణ సహాయంగా రూ.7వేలు ఆర్థిక సహాయం అందించారు. వారు పెద్ద అయ్యేంతవరకు ప్రతీ నెల రూ.1000 అందిస్తానని కృష్ణమూర్తి తెలిపారు.

గీత కార్మికుల సంక్షేమం మరచిన వైసీపీ

తణుకు, జనవరి 12: గీత కార్మికుల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం మరచిందని రాష్ట్ర గీత కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి అన్నారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ త్వరలో జరిగే రాష్ట్ర మహాసభల్లో గీత కార్మికుల సమస్యలపై చర్చించి పరిష్కారం కోసం పోరాడతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కడలి పాండు, దాసరి సూరిబాబు, గుబ్బల వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, ఆహారం పంపిణీ

ఆకివీడు, జనవరి 12: తల్లిదండ్రులను ఆస్తివనరులుగా చూడకుండా దేవుళ్ళగా పూజించాలని తహసీల్దార్ ఎన్నీ విజయలక్ష్మి, వినియోగదారుల సంఘం అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ అన్నారు. వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం లయన్స్, వినియోగదారుల సంఘం నేతృత్వంలో స్థానిక లయన్స్ కార్యాలయంలో పేద మహిళలకు దుప్పట్లు, భోజనం పొట్లాలు అందజేశారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎంవీఎస్‌రాజు, పల్లి అప్పిరెడ్డి, బొబ్బిలి బంగారయ్య, అడవి సుబ్బారావు, మోటుపల్లి శ్రీను, అహ్మద్, మోరా జ్యోతిరెడ్డి, నేరెళ్ళ ఆదినారాయణ పాల్గొన్నారు.

రాయకుదురులో మేనిఫెస్టో కరపత్రాల పంపిణీ

వీరవాసరం, జనవరి 12: రాయకుదురులో శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులు మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మేనిఫెస్టోలోని పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, కడలి నెహ్రూ, గ్రామ కమిటీల అధ్యక్షుడు కడలి వాసు, ముఖమట్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణాన్ని తీర్చిదిద్దుతున్నాం: గ్రంధి

భీమవరం రూరల్, జనవరి 12 : భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా అభివృద్ధి పథంలో తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నాడు భీమవరం త్రీటౌన్‌లో రూ.4కోట్ల 58 లక్షలతో నిర్మించిన రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర ఏళ్ళుగా భీమవరం పట్టణ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులను ఖర్చు చేయడం జరిగిందన్నారు. ముందుగా రూ.29 లక్షలతో పీపీ రోడ్డు జంక్షన్ నుంచి ఆర్టీసీ డీపో వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం మారుతి నగర్ నుంచి ప్రకృతి ఆశ్రమం కెనాల్ బండ వరకు కోటి 30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. రూ.38 లక్షలతో నిర్మించిన కముజు వారిపాలెంలో సీసీ రోడ్డు, డ్రైన్‌ను, కోటి 18 లక్షలతో ప్రకృతి ఆశ్రమం కెనాల్ బండ నుంచి భారతీయ విద్యాభవన్ వరకు నిర్మించిన బీటీ రోడ్డును ప్రారంభించారు.





తణుకు, పాండువ్వలలో బీసీ నాయకులతో కలిసి ఐక్యత చాటుతున్న ఆరిమిల్లి, ఎమ్మెల్యే మంతెన.. నరసాపురంలో బాండ్లు అందిస్తున్న పొత్తూరి

‘బీసీలకు టీడీపీలో అధిక ప్రాధాన్యం’

అత్తిలి, జనవరి 12: బీసీలకు అధిక ప్రాధాన్యమిచ్చిన పార్టీ టీడీపీ అని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం అత్తిలిలో జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాం నుంచి బీసీలకు పెద్దపీట వేశారన్నారు. బీసీ రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాలా అండగా నిలవాలని పార్టీ నిశ్చయించిందన్నారు. జగన్ నాలుగున్నరేళ్ళుగా బీసీలకు చేసిందేమీ లేదన్నారు. బీసీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, కడలి గోపాలరావు, ఆల్తి సత్యనారాయణ, కొప్పాడ రవీంద్రనాద్, పాలవలస తులసీరామ్, బీరక ప్రసాదు, గౌరి నాయుడు, గుబ్బల శ్రీనివాసు, ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: బీసీల ఉన్నతికి పాటుపడింది తెలుగుదేశమేనని అటువంటి పార్టీకి మరొకసారి పట్టం కడదామంటూ పలువురు బీసీ నాయకులు ప్రతినబూనారు. గురువారం పాందువ్వలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ 100రోజులు పార్టీ కోసము పనిచేస్తే అధికారం మనకే దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే రామరాజును, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బీసీ నాయకుడు జుత్తుగ శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నాగుంద్రకుమార్, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, బీసీ నాయకులు దొంగకృష్ణ, కట్టా రాంబాబు, కాగిత బుజ్జి, కొప్పాడ రవీంద్రనాద్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాందువ్వలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రామరాజు నిర్వహించారు. మాజీ సర్పంచ్ అల్లూరి వెంకట్రాజు మరికొంత మంది కార్యకర్తలు కలిసి ఎమ్మెల్యే రామరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిని పార్టీ కండువాకప్పి ఆహ్వానించి అభినందించారు.

నరసాపురం టౌన్: టీడీపీ అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 1వ వార్డులో బాబుషూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి వెళ్లి బాండ్లను అందించారు. కార్యక్రమంలో గుడాల సునీత, బి.చిన్నాయమ్మ, శ్రీను, బి.మల్లేశ్, మల్లాడి మూర్తి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, పొన్నాల నాగబాబు, షేక్ హుసేన్ పాల్గొన్నారు.





వీరవాసరం, ఇరగవరంలలో వినూత్న నిరసన.. పాలకోడేరులో జనసేన నాయకుల మద్దతు

అంగన్‌వాడీలు సంతకాల సేకరణ ఉద్యమం

ఆకివీడు/భీమవరం అర్బన్/పాలకోడేరు/వీరవాసరం/మొగల్తూరు/తణుకు/పెంటపాడు/ఇరగవరం/పెనుమంట్ర, జనవరి 12: ఆకివీడులో అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా 32వ రోజు స్థానిక శిబిరంలో సంతకాల సేకరణ, 32వ రోజు ఆకారంలో నిలబడి, సర్వమత ప్రార్థనలతో నిరసనలు తెలిపారు. భీమవరంలో సంతకాలు సేకరణ చేశారు. పాలకోడేరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలకు నియోజకవర్గ జనసేన నాయకుడు జుత్తుగ నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు మద్దతు తెలిపారు. వీరవాసరం బస్టాండ్ సెంటర్‌లో అంగన్వాడీలు సంతకాల సేకరణ చేపట్టారు. దీక్షా శిబిరం వద్ద చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. వీరికి కమ్యూనిస్టు నాయకులు మద్దతు తెలిపారు. మొగల్తూరు, తణుకు, పెంటపాడులలో శిబిరం వద్ద ఆందోళన చేశారు. ఇరగవరంలో అంగన్‌వాడీ కార్మికులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. పెనుమంట్రలో జీవో కాపీలతో నాలుక గీసుకుంటూ నిరసన తెలిపారు.


భీమవరంలో స్వామి వివేకానంద, ఎల్లాప్రగడ చిత్రపటాలకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మహనీయుడు స్వామి వివేకానంద

గణపవరం, జనవరి 12: మహనీయుడు స్వామి వివేకానంద అని సీనియర్ శాస్త్రవేత్త విష్ణుభట్ల లక్ష్మన్న కొనియాడారు. శుక్రవారం సరిపల్లెలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను అమెరికాలో నివాసం ఉంటున్నానని, భారత ప్రభుత్వం వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించడం అభినందించదగ్గ విషయమన్నారు. అల్లూరి సేవాసమితి సభ్యులు అల్లూరి గంగరాజు, రిటైర్డ్ లైబ్రేరియన్ చింతలపాటి సూర్యరాజు, గాదిరాజు గోపాలకృష్ణంరాజు, సంకు శ్రీనివాసరావు, నడింపల్లి ధర్మరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు శింగిలూరి చిట్టిబాబు మాట్లాడుతూ సాయం చేసిన వాళ్ళను మరువకూడదని, నమ్మినవారిని మోసం చేయరాదని, ప్రేమిస్తున్న వారిని ద్వేషించకూడదనే సూక్తులు నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

భీమవరం టౌన్: ప్రపంచ మానవాళికి ప్రాణ భిక్ష పెట్టిన డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు, యువ చైతన్యానికి స్ఫూర్తినిచ్చిన స్వామి వివేకానంద జయంతి వేడుకలను భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేజీఆర్ఎల్ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సాయి దుర్గప్రసాద్, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాచార్య దంపతులకు సత్కారం

ఆకివీడు, జనవరి 12: ఆరోగ్యమే మహా భాగ్యమని పతంజలి యోగారోగ్య కేంద్ర ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్‌కుమార్ అన్నారు. యోగాసనాచార్య కందుల సత్యనారాయణ 70వ జన్మదినోత్సవం శుక్రవారం స్థానిక కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణ-పార్వతి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేంద్రం కార్యదర్శి కుంకట్ల సత్యనారాయణ, రైస్ మిల్లర్స్ కార్యదర్శి గొంట్లా సత్యనారాయణ, నేరెళ్ళ రమణయ్య, ఫిలిం డిస్ట్రిబ్యూటర్ ఛైర్మన్ ఎం.శ్రీహరిరాజు, మాజీ సర్పంచ్‌లు గొంట్లా గణపతి, మన్నే పోతురాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మోటుపల్లి గంగాధరరావు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆకివీడు, జనవరి 12: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1976-77 సంవత్సరంలో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం జుంగా దాస్ ఆక్వా కార్యాలయం దగ్గర కలుసుకొని తమ జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. ఆ రోజుల్లో వారు చేసిన అల్లర్లు గుర్తుచేసుకున్నారు. ఒకర్ని ఒకరు అప్యాయంగా పలకరించుకున్నారు. పిల్లలు ఏమి చేస్తున్నారంటూ అడిగి తెలుసుకున్నారు. కలయికలో ఉండ్రమట్ల సాంబశివరావు, కాకర్ల రాజరాజేశ్వరి, మోటుపల్లి గంగాధరావు, గొంట్లా రాము, చొప్పెర్ల మహాదేవరావు, మాటూరి శ్రీను, బాబ్జిన్, బండారు మణి తదితరులు ఉన్నారు.

విద్యతోనే లక్ష్యాలు సాధించగలం: కలెక్టర్

భీమవరం ఎడ్యుకేషన్, జనవరి 12 : పిల్లలను ఉన్నత చదువులు చదివించడమే మనం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌కు ఇచ్చే గౌరవం అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. విజయవాడలో డా.బిఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటులో భాగంగా శుక్రవారం నాడు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారానే అన్ని సాధించుకోగలమని, పిల్లలకు తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, పెంద్ర వీరన్న, ఆర్డీవో కె.శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కాళ్ళ, జనవరి 12 : పూర్వ విద్యార్థుల కలయికకు ఏలూరుపాడు హైస్కూల్ వేదికైంది. 1995-96 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం ఒక చోట కలిశారు. స్నేహబంధము ఎంత మధురమో అంటూ.. విద్యార్థులు అంతా ఓచోట కలిసి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులంతా తమ వయస్సును పక్కన పెట్టి వినోద కార్యక్రమాల్లో పాల్గొని గీతాలాపన చేస్తూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

సొసైటీ రుణాల పంపిణీ

పోడూరు, జనవరి 12: జిన్నూరు సొసైటీలో 350మంది మహిళలకు రూ.17లక్షల 50వేల రుణాలను అందచేశారు. అనంతరం ఇటీవల సొసైటీ మహిళారైతు చుక్కా వెంకట కమల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఇన్సూరెన్స్ సంస్థ ద్వారా వచ్చిన రూ.2లక్షలు చెక్కును ఆమె బంధువులకు అందచేశారు. వైసీపీ ఇన్‌చార్జి గుడాల గోపీ, సొసైటీ అధ్యక్షుడు డీటీడీసీ బాబు, సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, సొసైటీ కార్యదర్శి పెచ్చెట్టి రామకృష్ణ, డైరెక్టర్లు గోగులమండ విజయాదేవి, పెచ్చెట్టి ముత్యాలు, భూపతిరాజు సూర్యరాజుపాల్గొన్నారు.

యల్లాప్రగడ సుబ్బారావు జయంతి

గణపవరం, జనవరి 12: ప్రఖ్యాత శాస్త్రవేత్త యల్లాప్రగడ సుబ్బారావు మానవాళి మనుగడకు ఔషధాలు సృష్టించిన మహనీయుడని పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు అన్నారు. శుక్రవారం గణపవరం లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో సుబ్బారావు జయంతి మండల పీఎంపీల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణమూర్తి అధ్యక్షత జరిగింది.

‘ఆరోగ్య సురక్ష’ను సద్వినియోగం చేసుకోవాలి

గణపవరం, జనవరి 12: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కాశీపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు కె.ప్రియాంక, ఎస్.సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కొట్టు పాదయాత్ర

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 12: మండలంలోని ఎల్. అగ్రహారంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ జగన్ పాలనపై ఆరా తీశారు. ఏఎంసీ ఛైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, మర్లపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

భీమవరం క్రైం, జనవరి 12: ఆటో డ్రైవర్ పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ అడబాల శ్రీను తెలిపిన వివరాలు ప్రకారం.. సుంకరపద్దయ్యగారి వీధిలో ఉంటున్న ఆటో డ్రైవర్ యల్లయ్య (40) ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇదిలావుండగా శుక్రవారం ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు అతడిని భీమవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గుంటూరు తీసుకెళుతుండగా మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

నరసింహస్వామి అలంకరణ



పాలకొల్లు టౌన్, జనవరి 12: పాలకొల్లు చిన్నగోపురం లోని శ్రీఅష్టభుజ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 27వ రోజు శుక్రవారం స్వామివారిని నరసింహస్వామిగా అలంకరించారు. ఆలయ అర్చకులు పవన్‌స్వామి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పండితులు రంగనాథస్వామి భక్తులకు తిరుప్పావై పాశుర విశేషాలను వివరించారు.

శ్రీవారి ఆలయంలో కూడారై ఉత్సవం

వీరవాసరం, జనవరి 12: రాయకుదురులోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని నిర్వహించారు. 108 గిన్నెలలో పాయసాన్ని గోదా రంగనాథస్వామికి నివేదించారు. ఈ సందర్భంగా గోదాదేవికి వెంకటేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలు చేశారు.

భీమవరం టౌన్: జువ్వలపాలెంరోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో కుడారై ఉత్సవాన్ని శుక్రవారంనాడు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పాయసంతో ఉన్న పాత్రలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

యువతను సన్మార్గంలో నడిపేది క్రీడలే


వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న గాంధీభగవాన్‌రాజు

పాలకొల్లు టౌన్, జనవరి 12: యువతను మంచి మార్గంలో నడిపించే శక్తి క్రీడలకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం బీఆర్ఎంబి మున్సిపల్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో దివంగత చెరుకూరి బుద్ధవతారం రాజు సౌత్ లెవిల్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభ సభకు ఆయన అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ మాజీచైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, బుద్ధవతారం రాజు కుమారుడు పెద్ద వర్మ చెరుకూరి విశ్వనాధరాజు, ఆడిటర్ రామరాజు పాల్గొన్నారు.

ఎస్కేఎస్డీకి ఐఎస్‌వో సర్టిఫికెట్


ఐఎస్‌వో ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

తణుకు, జనవరి 12: ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలకు శుక్రవారం అధికారులు ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేశారు. కళాశాలను ఐఎస్‌వో ఆడిటర్ ఆలపాటి శివయ్య తనిఖీ చేశారు. తనిఖీల అనంతరం ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణకు సర్టిఫికెట్ అందజేశారు. కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీ బాయ్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. శ్రీదేవి పాల్గొన్నారు.

హుబ్లీ ట్రైన్‌కు పాలకొల్లులో స్వాగతం

పాలకొల్లు, జనవరి 12: నరసాపురం నుంచి హుబ్లీ వెళ్లే రైలును శుక్రవారం గుంటూరులో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో నరసాపురం నుంచి పాలకొల్లు రైల్వేస్టేషన్‌కు వచ్చిన నరసాపురం - హుబ్లీ రైలుకు పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు కారుమూరి నరసింహరావు, వివిధ సంఘాల నాయకులు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. అనంతరం శాస్త్రోక్తంగా కొబ్బరికాయలు కొట్టి జెండా ఊపి ట్రైన్‌ను సాగనంపారు.


ఏటిగట్టు ప్రాంతంలో స్థానికులు, అధికారులతో మాట్లాడుతున్న కొత్తపల్లి

నరసాపురంలో కోతకు గురైన ఏటిగట్టు ప్రాంతాన్ని శుక్రవారం మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పరిశీలించారు. ఏటిగట్టు పనుల్లో నాణ్యతా లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.